ఇగ కాలం గాదు" ఉత్తరకార్తె వెళ్ళిపోగానే గట్టిగా నిర్ధారణ చేసుకుంది వీధిగుమ్మంలో నిల్చుని మునలమ్మ. పొడి మబ్బుజల్లులు తప్ప సమృద్ధిగా వర్షాలు పడక పదేళ్ళు దాటిపాయె. తనకున్నది నాల్గెకరాల భూమి. రెండెకరాలు తెగనమ్మి కొడుకుని పెద్దచదువు చదివించింది. వాన కొరకే తన ఎదురుచూపంతా! మిగిలిన ఆ రెండెకరాల కోసమే!



# దొరబిడ్డ

నన్నూరి సత్తిరెడ్డి

వర్షాలు పడితే భూమి సాగుచేసి పంట పండించాలని కాదు... రెండు చేతులా సంపాదించాలనీ కాదు... చేతినిండా పని దొరుకుద్ది అని కాదు... అయినా! పనిచేయడానికి ఓపికేదీ... పంట్లో సత్తువేది... చేసిచేసి అలసిపోయింది.

కాలం అయితే తన రెండెకరాల్ని కొనటానికి ముందుకెవరైనా వస్తారో ఏమో అని... వచ్చిన డబ్బుతో గుడిసె తీసి చిన్న పెంకుటిల్లు కట్టుకోవాలని. తమ కులంలో పుట్టినోల్లు బీదరికంలో ఉంటే వాల్లకు పిల్ల దొరకాలంటే కష్టమే. అందుకే కనీసం చిన్నపాటి ఇల్లైనా లేపోతే తన కొడుక్కి పిల్లనివ్వరేమోనని బెంగ! నిజమే మరి! ఇంట్లో మగదిక్కు లేని మునలమ్మ ఆతృతలో అర్థం వుంది... బాధలో భావమూ వుంది. మునలమ్మ అని సంబోధించగానే ఆమె మరీ పండు మునలేం కాదు... నలభైయేళ్ళు. కాని కష్టాలు ఆమెను మరింత మునల్దాన్ని చేశాయి.

ఓ పక్క సరైన కాలాలు లేక ఒకపూటే తిని బ్రతుకెళ్లదీస్తున్న మనిషి... మరోపక్క కొడుక్కి ఉద్యోగం రాలేదన్న బెంగ... క్రింది తరగతి వాళ్ళ బ్రతుకైనా బతకలేని దుస్థితిని తలచుకొని కుంగి వంగిపోయిన ఆమెను

చూస్తే 60 ఏళ్ళు దాటిన వండు ముసలిలాగే కన్పిస్తుంది.

ఆమె పేరు మణెమ్మ. భర్త ఫకీర్‌రెడ్డి. కొడుకు బుట్టిన రెండేళ్ళకే కన్నుమూశాడు. అప్పటి నుంచి మణెమ్మ బతుకు బాధలమయం. బాధలన్నీ దిగమింగింది. ధైర్యంతో కొన్నాళ్ళు వున్న నాల్గెకరాలు సాగుచేసి వంట వండించింది... అంతో యింతో కూడబెట్టింది. కొడుకు పెద్దవాడయ్యేకొద్ది ఖర్చులు పెరిగిపోవడం... కూడబెట్టిన డబ్బు ఖర్చైపోవడం..., దానికితోడు ఏటేటా కాలం వెనక్కి రావడం..., వంటలు వండకపోవడం..., భూమి బీడైపోవడం వరసగా జరిగిపోయినయ్...

"అమ్మా" పిలిచాడు కొడుకు. పేరు ఎంకరెడ్డి. కళ్ళు తెరిచిచూసింది ముసలమ్మ వీధిగుమ్మంలో నిల్చునే... అర్థమైంది కొడుక్కి... తల్లి ఆలోచనంతా తన బ్రతుకు గురించేనని.

"ఉద్యోగం"....! కొడుకు ముఖంకేసి ఆశగా చూసింది - ముసలమ్మ... 'రాలేదన్నట్టు' అడ్డంగా ఊపాడు తల... బాధగా నవ్వింది ముసలమ్మ... భగవంతుడు తమ బతుకులతో వరాచకాలాడటం కొత్త కాదనుకుంది.

"పెద్దిరెడ్డి కొడుక్కొచ్చిందంటగా"... అన్నది ముసలమ్మ పొద్దున ఎవరో చెప్తే విని.

"డబ్బు పోసి కొనుక్కున్నాడు"... అన్నాడు ఎంకరెడ్డి.

"చెంగల్‌రెడ్డి మనువనికి వచ్చిందిగా" రెండు క్షణాలాగి అంది ముసలమ్మ.

"అతడికి రాజకీయ వలుకుబడితో వచ్చింది".

"మారయ్య కొడుకు ఎంకటేశులుకు కూడా వచ్చిందట".

"అతనికి కోటాలో వచ్చింది".

"అట్లంటే" తెలియక అడిగింది ముసలమ్మ.

"రిజర్వేషన్ కోటాలో".

"నీ పేరు అండ్లెందుకు లేదూ"... రిజర్వేషన్ అంటే ఏమిటో తెలియకపోయినా... అడిగింది ముసలమ్మ.

ఎంకరెడ్డికి ఏ నమాధానం చెప్పాలో అర్థం కాలేదు... అది తమ చేతుల్లో లేదని ఎలా తల్లికి చెప్పేది... పేరు రానుకున్నంత మాత్రాన కులం మారదని ఆమెకేం తెల్సు... తనకు తెల్సిందల్లా... చదువుకున్న వాళ్ళందరికి ఉద్యోగాలొస్తాయని... అందుకేగా... తనని అంత కష్టపడి చదివించింది. రెండెకరాల భూమి అమ్మింది... తన చదువు కోసం వట్నానికి కట్టెలు మోసుకొచ్చింది.... సాటి కులస్తుల ముందు సిగ్గుతో తలొంచుకుని, ఆత్మాభిమానం చంపేసుకొని కూలిచేసి, డబ్బులు నంపాదించి బియ్యం కొనుక్కొచ్చింది... చెక్కుడు నంచిలో వున్న ఒకే ఒక 'ఐదు' రూపాయల నోటిచ్చి బస్సెక్కకుండా కాలి నడకతో వట్నం నుంచి ఇంటికి నడిసొచ్చింది... 'ముసలమ్మ కొడుకు నమాధానం కోసం ఎదురుచూస్తుంది'-

"అలా రానేకునే కాలం మించిపోయిందమ్మా.... అది ఏనాడో నేను పుట్టక పూర్వమే భగవంతుడు రాయాల్సింది" - శూన్యంలోకి చూస్తూ అన్నాడు ఎంకరెడ్డి.

కొడుకు అంటున్న మాటలు... చెబుతున్న వేదాంతం ముసలమ్మకు అర్థంకాలేదు.

ఉద్యోగపు వేటలో తిరిగి తిరిగి విసిగివేసారాడో ఏమో కళ్ళు పీక్కుపోయినయ్... జుట్టు, గడ్డం ముదిరిపోయింది. వేసుకున్న అంగి మాసి వట్టికట్టింది.

ఇలా ఎంకరెడ్డి ఉద్యోగాన్వేషణలో కాలచక్రం తిరుగుతూ ఉంది.

★ ★ ★



"హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్ చేస్తే బావుంటుందా?" నలహా అడిగాడు రావు.

"బాగా చదివితే హోటల్ పెట్టుకోవచ్చు. చదవకపోతే హోటల్లో సర్వర్‌గా పని చేయవచ్చు." ఏదైనవ్పటికీ బాగానే ఉంటుంది చెప్పాడు గోపి.

"ఎంకరెడ్డీ! ఇగ కొలువు రాదా బిడ్డ నీకు" నులక మంచం మీద వడుకున్న ముసలమ్మ మూలుగుతూ అంది.

రెండు రోజుల నుంచి ఒకటే జ్వరం... తగ్గినట్టే తగ్గి తిరుగబెడుతుంది... ఎందుకు తిరుగబెట్టదూ... ఆమె మననంతా కొడుకు భవిష్యత్తు గురించే... ఆలోచనంతా కొడుక్కి ఉద్యోగం రాలేదనే... ఆమె బెంగంతా అయిన కుటుంబంలో వుట్టిన తన కొడుక్కి ఉద్యోగం లేకుంటే పిల్లను యివ్వటానికి ఎవరూ ముందుకు రావటం లేదనే... తోటి పిల్లలందరికీ పెళ్ళిళ్ళై నంసారాలు చేస్తున్నారు....

"చెప్పు కొడకా"...

మళ్ళీ అడిగింది ముసలమ్మ. ఏమని చెప్పగలడు...? ఈ రోజుల్లో తన కేటగిరీ వాళ్ళకి ఉద్యోగం అంత నులువుగా రాదని తెలును... అదే విషయం... తల్లితో చెబితే... ఈ నమయంలో ఇంకేమైనా వుందా... జరగబోయే వరిణామాలు ఎంకరెడ్డిని ఒక్కపెట్టున కుదిపేశాయి... గుడ్లనిండా నీళ్ళు తిరిగినయ్.

"అమ్మా! నాకు కొలువు రాకపోయినా - బ్రతగ్గలనే! అవన్ని ఆలోచించి మనను పాడుచేసుకోకు"....

భారంగా కళ్ళు తెరిచి చూసింది ముసలమ్మ మంచంపై వడుకునే... బ్రతుకు గూర్చి తనకే చెప్తొన్నాడనుకుంది మనసులో... తను బ్రతకలే యిన్నేళ్ళు... కాయకష్టం చేస్తూ, అవమానాలు భరిస్తూ, మగతోడు లేకుండా...! తనలాంటి బ్రతుకే కొడుక్కి రాకూడదనేగా... ఇన్నేళ్ళ తన అవిశ్రాంత పోరాటం.

'కొడుకన్న మాటకు ఏడ్చింది ముసలమ్మ మాటలు - రాలేక వెక్కివెక్కి.

ఎలా వస్తాయ్ మాటలు...? నేటికి రెండ్రోజులాయె పెదవులు తడారిపోయి... శబ్దం రావడానికి నత్తువేదీ... గ్లానుడు పాలు తేవడానికైనా డబ్బు లేదు ఎంకరెడ్డి దగ్గర... మందులేం కొని తీనుకరాగలడు... తను వుట్టిన 25 ఏళ్ళలో రూపాయి బిళ్ళను ఏనాడు తనివితీరా జేబులో రెండు రోజులు చూనుకోలేకపోయాడు.... అదే విషయం ఆలోచించాడు... జుట్టు పీక్కుని రెండు క్షణాలు... ఏం స్ఫురణకొచ్చిందో... లేచి లోనికెళ్ళి నూకల జావ చేసి తెచ్చి తినిపించాడు తల్లికి. తడిగుడ్డతో తల్లిమొఖం తుడిచి మంచంపై వడుకోబెట్టి బయలుదేరాడు నూరులో చెక్కి వున్న కొడవలి తీనుకొని ఎంకరెడ్డి

★ ★ ★

'కలం వట్టాల్సిన చేయి భుక్తి కోసం కొడవలి బట్టుకుంది' చేనులో నద్దకంకులు కోస్తూ మననులో అనుకున్నాడు ఎంకరెడ్డి.

చెమటలు వళ్ళంతా దారలు కారుతున్నాయ్... నోరు పిడుచుకట్టింది... నెత్తిమీద ఎండ భగ్గుమంటుంది. తోటి కూలీ జనం యివేమి వట్టించుకోకుండా ముందుకు సాగిపోతున్నారు... ఈ ఎండల్లోనేనా తన తల్లి తన బ్రతుకు కోసం యాతనవడి నంపాదించింది... తన వట్నం చదువుల కోసం అహర్నిశలు ఈ ఎండల్లోనేనా కాయకష్టం చేసింది... భోరున ఏడ్చాడు ఎంకరెడ్డి అక్కడే కూర్చుని... ఎండ తీవ్రతకు కాళ్ళు మంటలేసినయ్... ఈ అగ్నిసెగల్లోనేనా తన తల్లి కాలు మోపి కాయకష్టం చేసింది... గుండెలు గుద్దుకొని అరిచాడు... ఏడ్చాడు... మనను బాధ తీరేంతవరకు.

"ఎంకరెడ్డీ నువ్వీ కష్టం సేయలేవు"...

తలెత్తి చూశాడు... ఎవరూ కన్పించనంతగా కళ్ళనిండా నీళ్ళు.

"నీతోటి నదువుకున్నోళ్లంతా కొలువు సేస్తుంటే నీకిదేం సెర".

కారుతున్న కళ్ళనీళ్ళను చేత్తో తుడిసేనుకున్నాడు.

"నదువుకోకనే మాకీ కష్టమాయె - నదువుకున్న నీకెందుకూ"....

చదువుకొని మీరే ఈ రోజుల్లో - అదృష్టవంతులు... ఏ వనైనా చేసి బ్రతకగలరు. చదువుకున్న తన లాంటి వాడికే ఈ కష్టం'... ఎంకరెడ్డి అంతర్వాణి వలికింది.

"వట్నంబోయి ఏదన్న సిన్నపాటి కొలువు జూనుకో"...

తన చుట్టూ మూగివున్న కూలీలందరి వైపు చూశాడు తలెత్తి. వాళ్ళు చెప్పిందే నరైన మార్గం.... క్రింద వడిన కొడవలిని చేతిలోకి తీసికొని బయలుదేరాడు... నడక సాగిస్తున్న ఎంకరెడ్డిని ఎన్నో నమన్యలు, నందేహాలు చుట్టిముట్టినయ్... వాటి వరిష్కారాన్వేషణలోనే ఊళ్ళోకొచ్చిన ఎంకరెడ్డి ఎవరో పిలిచిన చప్పుడు విని ఆగిపోయాడు.

"ఏంటయ్యా! ఉదయం నుండి నీ కోనం ఎదురు చూస్తున్నాను... వెతికి వెతికి వేశారిపోయాను... నీకోనం ఉత్తరం వచ్చింది".

అంటూ ఉత్తరం యిచ్చి వెళ్ళిపోయాడు పోస్టుమాన్.

ఉత్తరం చింపి చదివిన ఎంకరెడ్డి ఎగిరిగంతేశాడు... ఇంతదాకా తనను చుట్టుముట్టి వేధించిన నమన్యలు - నందేహాలు దూదిపింజల్లా ఎగిరిపోయినయ్. తనకు ఉద్యోగం వచ్చింది... తమ కష్టాలు... గట్టెక్కాయి... తన తల్లి వడ్డ కష్టాలు ఈ రోజుతో తీరిపోయాయి.. వట్టరాని ఆనందం ఎంకరెడ్డిని ఉక్కిరిబిక్కిరి చేసింది.

తన తల్లిని వట్నం తీసుకెళ్ళాలి... మంచి డాక్టర్‌కు చూపించి ట్రీట్‌మెంట్ ఇప్పించాలి... తన తల్లిని కాలు కిందమోపనివ్వకుండా యిక ముందు చాదాలి... మూడు పూటలా... మంచికూరలు... భోజనం... ఏవేవో ఆలోచనలు మనసులో మెదలసాగినయ్... వరుగెత్తుకెళ్ళి, విషయం అమ్మ చెవిలో వేయాలనుకున్నాడు... ఆనందంతో అమ్మ మంచంపై కూర్చుని నవ్వుతుంటే చూడాలి అనుకున్నాడు....

ఇంటికి వదిగజాల దూరం నుంచే "అమ్మా" అంటూ వరుగెత్తుకొచ్చాడు.

"అమ్మా నాకు పోస్టొచ్చిందే" ఒగర్చుతూ మంచం దగ్గరగా వచ్చి అన్నాడు.

'ఆ మాట ముసలమ్మ వినలేదూ... మాట్లాడలేదు'. అది గమనించిన వెంకరెడ్డి గుండె ఆగినట్లయింది. చేతిలోని పోస్టు కాగితం జారి కిందవడింది.